క్లుప్తంగా

సీఎం పర్యటనపై నేడు కొవ్వూరులో సమావేశం

కొవ్వూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఈనెల 30న నిడదవోలు పర్యటనకు వస్తున్న నేపథ్యంలో సోమవారం ఉదయం 10 గంటలకు కొవ్వూరులోని మంత్రి క్యాంపు కార్యాలయం వద్ద వైఎస్సార్ సీపీ నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్టు ఆ పార్టీ మండలశాఖ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ ఆదివారం తెలిపారు. పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, కార్యకర్తలు, పార్టీలో వివిధ హోదాల్లో ఉన్న నాయకులు ఈ సమావేశానికి విధిగా హాజరు కావాలని కోరారు. సీఎం పర్యటన విజయ వంతం చేసే కార్యక్రమంలో భాగంగా ఈ సమావేశం ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

నేడు 'ఆహా' క్యాంటీన్ ప్రారంభం

కొవ్వూరు: స్థానిక బస్టాండ్ జంక్షన్ వద్ద గల మెప్మా కార్యాలయం వద్ద డ్వాక్రా మహిళలతో ఏర్పాటు చేసే ఆహా క్యాంటీన్‌ను సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత ప్రారంభించనున్నట్లు టౌన్ మిషన్ కో–ఆర్డినేటర్ జేవీవీఎస్ భవాని ఆదివారం తెలిపారు. మార్కెట్ ధరల కంటే తక్కువ ధరలకు అందుబాటులో ఉండేలా వివిధ రకాల ఫుడ్ ఐటమ్స్ ఇక్కడి విక్రయించనున్నట్లు తెలిపారు.

చోడేశ్వరస్వామికి విశేష పూజలు

కొవ్వూరు: స్థానిక పాతూరులోని ఉమా చోడేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం గణపతి పూజ, స్వామి వారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు జరిగాయి. అమ్మవారికి శ్రీసూక్త విధానంలో కుంకుమ పూజ చేశారు. స్వామి వారికి బిల్వార్చన చేశారు. ఉండ్రాజవరానికి చెందిన ఏలూరుపాటి సత్యకృష్ణ, సుబ్బలక్ష్మి దంపతుల చేతుల మీదుగా పూజలు కొనసాగాయి.ఆలయ ప్రధానార్చకుడు దేవరకొండ సాయిప్రసాద్, కొత్తవరపు భానులతో పాటు పలువురు పండితులు పాల్గొన్నారు.

దక్షిణ వీధి రామాలయం ప్రారంభం

నల్లజర్ల: నల్లజర్ల గ్రామంలోని దక్షిణ వీధి రామాలయాన్ని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ఆదివారం ప్రారంభించారు. ఈ పురాతన ఈ రామాలయాన్ని దాతల విరాళాలు రూ.10 లక్షల వ్యయంతో పునర్నిర్మించారు. అంతకు ముందు మార్ని నాగేశ్వరరావు దంపతులు ఆలయంలో పూజాదికాలు నిర్వహించారు. గణపవరం మండలం జల్లి కొమ్మర గ్రామానికి చెందిన రామా ఆధ్యాత్మిక సేవా సమితి భాగ్యలక్ష్మి బృందం సేవా కార్యక్రమాలు నిర్వహించింది. ఈ సందర్భంగా 3,500 మందికి అన్నసమారాధన జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే వెంకట్రావు ప్రారంభించారు. వెల్లంకి వెంకట సుబ్రహ్మణ్యం, సొసైటీ అధ్యక్షుడు కారుమంచి రమేష్, వల్లూరి శేషగిరి, నీరుకొండ జమకృష్ణ, బేతిన దుర్గారావు విఘ్నేశ్వరావు పాల్గొన్నారు.

300 మందికి ఉచిత కంటి పరీక్షలు

ద్వారకాతిరుమల: విజడమ్, రామకృష్ణ ఫౌండేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో డాక్టర్ పులవర్తి రామకృష్ణ పర్యవేక్షణలో స్థానిక సాయిబాబా ఆలయ సమీపంలో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గ్రామానికి చెందిన పీవీ బ్రదర్స్ తమ తండ్రి పులవర్తి బాలయ్య జ్ఞాపకార్థం ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. సుమారు 300 మంది రోగులకు ఏలూరుకు చెందిన ప్రముఖ వైద్యురాలు ప్రభావతి, జంగారెడ్డిగూడెంకు చెందిన ఆర్‌కే డయగ్నోసిస్ ల్యాబ్ నిర్వాహకులు సేవలనందించారు. కంటి శుక్లాలు, దృష్టి లోపం ఉన్న వారిని గుర్తించి, చికిత్స పొందే విధానంపై అవగాహన కల్పించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ నిర్వాహకులు రామకృష్ణ, కిరణ్, హేమంత్‌లతో పాటు కేశవ పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థులకు దంత పరీక్షలు



పరీక్షలు చేస్తున్న డాక్టర్ కాంతికుమార్. చిత్రంలో చైర్‌పర్సన్ రత్నకుమారి

కొవ్వూరు: స్థానిక క్రిస్టియన్ పేట సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో ఆదివారం దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని మునిసిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి ప్రారంభించారు. దాక్షారామకు చెందిన భీమేశ్వర దంత వైద్యశాల వైద్య నిపుణుడు బి.కాంతికుమార్ విద్యార్థులకు దంత పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. రిటైర్డ్ హాస్టల్ వార్డెన్ పెనుమాక జయరాజు, దళిత సంఘం నాయకులు బొంతా శ్యాం రవి ప్రకాష్, కోరుకొండ చిరంజీవి, హాస్టల్ వార్డెన్ ముప్పిడి రాజు, రత్నం తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతి పొందిన డాక్టర్‌కు సన్మానం

చాగల్లు: మండలంలోని బ్రాహ్మణగూడెం పీహెచ్‌సీ వైద్యుడు తొర్లపాటి హర్షవర్ధన్‌ను ఆదివారం ఘనంగా సత్కరించారు. హర్షవర్ధన్ పదోన్నతిపై కాకినాడ ప్రభుత్వాస్పత్రి పిల్లల విభాగంలో నియమితులయ్యారు. ఇప్పటి వరకూ ఆయన తాడిమళ్ల, మార్కొండపాడు, దేవరపల్లి పీహెచ్‌సీలలో చక్కటి సేవలు అందించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ నాయకులు, స్థానికులు ఆయనకు శాలువా కప్పి, పూలమాల వేసి సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కొలాటి కాంతారావు, డాక్టర్ అరుణ్‌రాయ్, అంబేడ్కర్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

వర్జీనియా పొగాకు సాగుకు సమాయత్తం

- ఈ ఏడాది పొగాకుకు మంచి రేటు
- లాభాలు ఆర్జించిన రైతులు
- బోర్డు వద్దంటున్నా సాగు విస్తీర్ణం పెంచే యత్నాలు



ట్రేలలో పెంచుతున్న పొగాకు నారు

గోపాలపురం: మెట్ట ప్రాంతంలో ప్రధాన వాణిజ్య పంట అయిన వర్జీనియా పొగాకు సాగుకు రైతులు సన్నద్ధం అవుతున్నారు. ఈ ఏడాది పొగాకు ధరలు ఆశాజనకంగా ఉండడంతో రైతులు సాగు విస్తీర్ణాన్ని పెంచే ప్రయత్నాలు మొదలు పెట్టారు. గత 15 రోజులుగా వారు పొగాకు నారుమడులను సిద్ధం చేస్తున్నారు. ట్రేలలో నారు పెంపకం చేపట్టారు. ఈ ఏడాది రైతులు నూతన రకాలైన ఎల్‌వీ– 7, సీజే–11 వంగడాలను నారు కట్టారు. ఐటీసీ, సీటీఆర్‌ఐలు తయారు చేసిన వంగడాలను ఎక్కువ మంది రైతులు నారు కట్టారు. అక్టోబర్ మొదటి వారం నుంచి పొగాకు నాట్లు వేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

ట్రేలలో నారు పెంపకం

ఎండకు, వానకు తట్టుకొనేలా షెడ్లు ఏర్పాటు చేసి ట్రేలలో పొగాకు నారును పెంచుతున్నారు. 25 రోజుల వయసున్న నారును పొలంలో నాట్లుగా వేస్తారు. తేలిక పాటి నేలల్లో (ఎస్ఎల్ఎస్) పండించే వర్జీనియా పొగాకుకు అంతర్జాతీయ మార్కెట్‌లో గిరాకీ ఎక్కువ. ఇక్కడ పండించే పొగాకును ఐటీసీతో పాటు మరో 12 పొగాకు కంపెనీలు పోటీ పడి మరీ కొనుగోలు చేస్తుంటాయి. ఈ ఏడాది జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం, దేవరపల్లి, గోపాలపురం పొగాకు వేలం కేంద్రాల ద్వారా జరిపిన విక్రయాల్లో కిలో పొగాకుకు రూ. 248.31 సరాసరి ధర రైతులకు లభించింది. గతంతో పోలిస్తే ఇది చాలా ఎక్కువ. దాంతో కొత్తగా ఏడాది సాగు విస్తీర్ణాన్ని పెంచేందుకు రైతులు ముందుకు వస్తున్నారు. మామిడి, జీడిమామిడి, జామాయిల్ వంటి పంటలను తొలగించి వర్జీనియా పొగాకు సాగుకు సన్నాహాలు చేస్తున్నారు.

బోర్డు అనుమతి మేరకే సాగు చేయాలి

పొగాకు బోర్డు నిర్దేశించిన విస్తీర్ణం మేరకే వర్జీనియా పొగాకు సాగు చేయాలి. లేని పక్షంలో రైతులు ఆఖరున ఇబ్బందులు పడతారు. దీనిపై ఇప్పటికే రైతులకు వివరించాం. అయినప్పటికీ ఎక్కువ మంది రైతులు మామిడి, జీడిమామిడి, జామాయిల్ తోటలను తొలగించి పొగాకు సాగుకు సన్నాహాలు చేస్తున్నట్టు బోర్డు దృష్టికి వచ్చింది.

– ఎం.ఆదిశేషయ్య, పొగాకు బోర్డు రీజినల్ మేనేజర్, రాజమహేంద్రవరం

ఈ ఏడాది కూడా బాగుంటుదనే ఆశతోనే..



వచ్చే ఏడాది కూడా పొగాకు కొనుగోళ్లు కిలోకు రూ 250 నుంచి ప్రారంభం అవుతాయనే ఆశాభావంతో సాగుకు సిద్ధమవుతున్నాం. ఈఏడాది పొగాకు ధరలు పెరగడంతో బ్యారన్ అద్దెలు, పొలం కౌలు కూడా భారీగా పెరిగాయి. బ్యారన్ అద్దె రూ.80 వేల నుంచి రూ. లక్ష వరకూ ఉంది. ఎకరం పొలం కౌలు రూ 40 వేల నుంచి రూ. 50 వేలకు పెరిగిపోయింది. గతేడాదితో పోలిస్తే సగానికి సగం ధరలు పెరిగిపోయాయి.

– కొర్లపాటి అన్నవరం, రైతు పెద్దాపురం

ఎరువుల కొరత లేకుండా చర్యలు



పొగాకు తోటలకు ఎరువుల కొరత లేకుండా యూనియన్ బ్యాంకు అధికారులతో సంప్రదింపులు జరిగాయి. రైతులకు తోటలు వేయడానికి ముందే వారికి అవసరమైన ఎరువులు పంపిణీకి బ్యాంకు అధికారులు అంగీకరించారు.

– పరిమి జగదీష్, ఎరువుల కమిటీ చైర్మన్, గోపాలపురం

పల్లెల్లో పరుగులు పెడుతున్న అభివృద్ధి

- ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- రామన్నపాలెంలో సచివాలయ భవనం ప్రారంభం



గ్రామ సచివాలయ భవనం ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

దేవరపల్లి: పల్లెల్లో అభివృద్ధి పరుగులు పెడుతోందని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. మండలంలోని రామన్నపాలెంలో రూ.40 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ఆదివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో గ్రామ సచివాలయ భవనాల నిర్మాణాలు దాదాపు పూర్తయ్యాయన్నారు. గ్రామ సచివాలయ భవనాల నిర్మాణాలకు నియోజకవర్గంలో రూ.32 కోట్లు ఖర్చు చేస్తున్నట్టు చెప్పారు. గ్రామ సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ ద్వారా పాలన ప్రజల ముంగిటకు వచ్చిందన్నారు. ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులతో దళితవాడల అభివృద్ధికి ప్రణాళిక సిద్ధం చేశామని, త్వరలో పనులు ప్రారంభిస్తామని తలారి చెప్పారు. దళితవాడల్లో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కూచిపూడి బుల్లారావు, ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, ఎంపీపీ కేవీకే దుర్గారావు, జెడ్పీటీసీ సభ్యురాలు పొట్టి స్వర్ణలత, ఎంపీటీసీ సభ్యుడు సత్తి జగదీశ్వరరెడ్డి, ఉప సర్పంచ్ రాపాక రేణుక, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కూచిపూడి సతీష్, మండల మహిళా కన్వీనర్ కడలి హైమావతి, మాజీ సర్పంచ్ కూచిపూడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలారి వెంకట్రావును గ్రామస్తులు ఘనంగా సన్మానించారు.

తపాలా శాఖ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు



పోటీలకు ఆహ్వానిస్తూ పోస్టల్ శాఖ రూపొందించిన పోస్టర్

నల్లజర్ల: ప్రస్తుత డిజిట్ యుగంలో తగ్గిపోతున్న చేతిరాతను ప్రోత్సహించే ఉద్దేశంతో తపాలా శాఖ జాతీయ స్థాయిలో ఢాయి ఆఖర్ పేరుతో వ్యాసరచన పోటీలు నిర్వహిస్తోంది. దీనికి వయస్సుతో పనిలేదు.అన్ని వయసుల వారూ పాల్గొవచ్చు. డిజిటల్ ఇండియా, డిజిటల్ పాలన, డిజిటల్ అక్షరాస్యత, డిజిటల్ సదుపాయాలు, డిజిటల్ ఆర్థిక లావాదేవీలు, అందరికీ డిజిటల్ కనెక్టివిటీ, సైబర్ భద్రత వంటి అంశాలపై లేఖ రాయాలి. ఎనవలప్ కవరుపై రాసే వారు ఎ–4 సైజు తెల్ల కాగితంపై వెయ్యి పదాలకు మించకుండా రాయాలి. ఇన్‌లాండ్ లెటర్‌పై రాసేవారు 500 పదాలకు మించకూడదు. తెలుగు, ఇంగ్లిషు, హిందీ వంటి ఏ భాషలోనైనా వ్యాసం రాయవచ్చు. కవరుపై వయస్సు రాసి నిర్ధారణ జత చేయాలి. కవరుపై ఎంట్రీ ఫర్ ఢాయి ఆఖర్ అని రాయాలి. టూ.ఎస్ సెస్ పీఓఎస్ తాడేపల్లిగూడెం డివిజన్ అడ్రసుకు పోస్టు చేయాలి. అక్టోబరు 31వ తేదీ చివరిరోజు. రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతిగా రూ.25వేలు, ద్వితీయ బహుమతిగా రూ.10 వేలు, తృతీయ బహుమతిగా రూ.5వేలు అందజేస్తారు. అదే జాతీయ స్థాయిలో రూ.50వేలు, రూ.25వేలు, రూ.10వేలు బహుమతిగా ఇస్తారు.

రోగుల వైద్యానికి 'మానవత ' ఆర్థిక సాయం



నిడదవోలులో ప్రభుదాసుకు రూ.20 వేల ఆర్థిక సాయం చేస్తున్న మానవత సంస్థ సభ్యులు

నిడదవోలు: ఇద్దరి వైద్య సేవల కోసం మానవత సేవా సంస్థ నిడదవోలు శాఖ ఆర్థిక సహాయం చేసింది. దీర్ఘకాల వ్యాధితో బాధపడుతున్న స్థానిక టౌన్ హాల్ సమీప నివాసి ఉజ్జిన వెంకట్రావుకు రూ.6,000, ఇటీవల ప్రమాదంలో కాలు విరిగిపోయిన టౌన్‌హాల్ ఉద్యోగి ప్రభుదాసు ఆపరేషన్ నిమిత్తం రూ.20,000 అందజేశారు. ఈ రెండు మొత్తాలను మానవత సంస్థ నిడదవోలు శాఖ అధ్యక్షులు కాజ గంగరాజు అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆ సంస్థ జిల్లా అధ్యక్షులు తాడేపల్లి మోహనరావు చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో చెరుకూరి వల్లభరాయుడు, ఉపాధ్యక్షుడు జీవీఎస్ కృష్ణారావు, మాజీ అధ్యక్షులు కొప్పుల వెంకటేశ్వరరావు, నీలం రామారావు, కుందుల ప్రభాకరం పాల్గొన్నారు.

పెద్దేవం వాసికి..

తాళ్లపూడి: పక్షవాతంతో రెండేళ్లుగా కదలలేని స్థితిలో ఉన్న పెద్దేవం గ్రామస్తుడు బోడపాటి వెంకటరత్నానికి మానవత స్వచ్ఛంద సంస్థ మండల శాఖ ఆదివారం ఆ సంస్థ అధ్యక్షుడు సాయన సుబ్బారావు చేతుల మీదుగా రూ.5 వేల ఆర్థిక సాయం చేశారు. మానవత సంస్థ రీజినల్ చైర్మన్ వి. చంద్రయ్య, సభ్యుల గెద్దం సాయిబాబా, ఎ హనుమంతరావు, తిగిరిపల్లి దోశాలు, సనపల రాజశేఖర్, తుంపూడి గుప్త పాల్గొన్నారు.

హైందవ సేవాసమితి సేవలు భేష్

- ప్రశంసించిన బ్రహ్మశ్రీ లింగాల శ్రీనివాసశర్మ
- చాగల్లులో ప్రతి ఆదివారం శ్రీకృష్ణ ఆనందలహరి వికాస కార్యక్రమం



ఆధ్యాత్మిక అంశాలపై చిన్నారులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

చాగల్లు: తెలుగు సంస్కృతీ సంప్రదాయాల గురించి భావితరాలకు తెలియ జెప్పే బృహత్తర బాధ్యతను శ్రీ కృష్ణ హైందవ సేవాసమితి స్వీకరించడం ప్రశంసనీయమని బ్రహ్మశ్రీ లింగాల శ్రీనివాసశర్మ అన్నారు. చాగల్లులోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం ప్రాంగణంలో ఆదివారం శ్రీకృష్ణ ఆనందలహరి వికాస కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసశర్మ మాట్లాడుతూ మండలంలోని చిన్నారులకు తెలుగు సాహిత్య, సంప్రదాయ విలువల గురించి వివరించేందుకే ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. శ్రీ కృష్ణ హైందవ సేవా సమితి ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం ఉద్యయం 9 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ వివిధ అంశాలపై అవగాన కల్పిస్తున్నామని చెప్పారు. మూడు నుంచి 15 ఏళ్ల బాలలు హాజరు కావాలన్నారు. అలాగే వారికి భగవద్గీతలోని శ్లోకాలను, నృత్యాలను, సంగీతాన్ని పిల్లలకు నేర్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జుట్టా వెంకటగణపతి, పిచుకుల వెంకట సత్యనారాయణ, తాళ్ళూరి వెంకట రామప్రసాద్, కె.సూర్యప్రకాశరావు, ఎం.సత్యనారాయణ, సమితి సభ్యులు పాల్గొన్నారు.

రాధాకృష్ణుల డోలోత్సవం ప్రారంభం



డోలోత్సవం సందర్భంగా శ్రీరామనంద గౌడీయ మఠంలో ఉయ్యాలలో రాధాకృష్ణులు

కొవ్వూరు: రాధాకృష్ణుల డోలోత్సవం, శ్రీకృష్ణ జయంతి ఆదివారం పట్టణంలోని శ్రీరామనంద గౌడీయ మఠంలో ప్రారంభమయ్యాయి. విబూధ వామన మహరాజు ఆధ్వర్యంలో ఉదయం తొమ్మిదింటికి ఉత్సవాలను ప్రారంభించారు. పండితుడు దోర్బల ప్రభాకరశర్మ డోలోత్సవం గొప్పదనంపై ఉపన్యసించారు. ఈనెల 30 వరకూ డోలోత్సవం జరుగుతుంది. సెప్టెంబర్ 1 నుంచి ఆరో తేదీ వరకూ భాగవత గోష్టి, పలువురి పండితులతో ఉపన్యాసాలు ఉంటాయి.7న శ్రీకృష్ణ జయంతి, 8న నంద మహారాజు ఆనందోత్సవం నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. కాగా ఆదివారం ఉదయం, సాయంత్రం మఠంలో ప్రత్యేక భజనలు చేశారు. శ్రీకృష్ణ నామ స్మరిస్తూ కీర్తనలు చేశారు. డోలోత్సవంలో భాగంగా రాధాకృష్ణుల విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై ఉయ్యాలలో ఉంచారు.

జాతీయ నేతల విగ్రహాలు ధ్వంసం



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న గోపాలపురం పోలీసులు

గోపాలపురం: రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్, గమాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాల ముఖ భాగాలను గుర్తు తెలియన వ్యక్తులు పగలగొట్టారు. ఈ ఘటన మండలంలోని వాదాలకుంట జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో జరిగింది. శనివారం సాయంత్రం పాఠశాల ముగిశాక విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇళ్లకు వెళ్లిపోయారు. శనివారం రాత్రి వాచ్‌మన్ కాపాలా ఉన్నాడు. బహుశా ఆదివారం ఉదయం దుండగులు ఈ దుశ్చర్యకు పాల్పడి ఉండవచ్చని భావిస్తున్నారు. ఆదివారం సాయంత్రం ఈ మైదానంలో ఆడుకునేందుకు వచ్చిన విద్యార్థులు ఇద్దరి జాతి నేతల ముఖభాగాలు దెబ్బతిని ఉండడాన్ని గుర్తించి ఉపాధ్యాయులకు తెలిపారు. ఉపాధ్యాయులు అందించిన సమాచారం మేరకు గోపాలపురం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కాగా విగ్రహాల ముఖభాగాల గాయాలకు బాధ్యులైన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని దళిత సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

ఎమ్మెల్యే, డీఎస్పీ రాక

గ్రామంలో దళితుల ఆందోళన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, కొవ్వూరు డీఎస్పీ వీఎస్ఎన్ వర్మ హుటాహుటిన అక్కడకు చేరుకున్నారు. ఆందోళనకారులతో చర్చలు జరిపారు. సోమవారం సాయంత్రానికల్లా రెండు విగ్రహాలకు మరమ్మతులు పూర్తి చేయించి, క్షీరాభిషేకం చేస్తామని ఎమ్మెల్యే వెంకట్రావు ప్రకటించారు. అలాగే స్థానికులు సహకరిస్తే సాధ్యమైనంత త్వరలో ఈ ఘటనకు బాధ్యులైన దోషులను పట్టుకున చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని డీఎస్పీ వర్మ హామీ ఇచ్చారు. దాంతో దళితులు ఆందోళన విరమించారు.

ఎమ్మెల్యే తలారిని కలిసిన 'ఆరేటి'



ఆరేటి సూర్యనారాయణను అభినందిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

దేవరపల్లి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన మండలంలోని యాదవోలు ఉప సర్పంచ్ ఆరేటి సూర్యనారాయణ ఆదివారం దేవరపల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావును మర్యాద పూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందించారు. సూర్యనారాయణను ఎమ్మెల్యే తలారి సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలో కష్టపడి పనిచేసే కార్యకర్తలకు గుర్తింపు ఉంటుందన్నారు. దీనికి నిదర్శనం ఆరేటి సూర్యనారాయణకు జిల్లా ప్రధాన కార్యదర్శి పదవి దక్కడమే అని అన్నారు. అలాగే నల్లజర్ల మండలం దూబచర్లకు చెందిన పంది సత్యనారాయణను జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులైనట్టు చెప్పారు.

కోడి పందేలు ఆడుతున్న నలుగురి అరెస్ట్

కొవ్వూరు: మండలంలోని కుమారదేవం గ్రామ శివార్లలో ఆదివారం కోడి పందేలు ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసినట్టు కొవ్వూరు రూరల్ ఎస్సై జి.సతీష్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.600 నగదు, రెండు కోళ్లు, రెండు కత్తులను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను సోమవారం కోర్టులో హాజరు పరచనున్నట్టు తెలిపారు.

బాలుడి ఆచూకీ కోసం ప్రత్యేక బృందాల ఏర్పాటు

నిడదవోలు రూరల్: ఈ నెల 24వ తేదీ సాయంత్రం అదృశ్యమైన మండలం సమిశ్రగూడేనికి చెందిన ఎనిమిదేళ్ల బాలుడు పాలపర్తి రోహన్ (రిక్కి) ఆచూకీ కోసం రెండు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేసినట్టు సీఐ వెంకటేశ్వరరావు ఆదివారం తెలిపారు. ఇంటి సమీపంలోని వాటర్ ట్యాంక్ వద్ద ఆడుకునేందుకు వెళ్లిన రోహన్ తిరిగి రాలేదంటూ తండ్రి శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సమిశ్రగూడెం పోలీసులు కేసు నమోదు చేశారన్నారు. ఉభయ గోదావరి జిల్లాలతో పాటు పలు బస్టాండ్లు, రైల్వేస్టేషన్‌లలో బాలుడి రోహన్ ఆచూకీ కోసం విస్తృతంగా గాలిస్తున్నట్టు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

కొవ్వూరు: మోటార్ సైకిల్‌ను ఆర్టీసీ బస్సు ఢీ కొట్టిన ప్రమాదంలో నల్లజర్ల మండలం ముసుళ్లకుంట గ్రామానికి చెందిన బలుసు అఖిల్, అతని బావ మరిది రాజేష్‌లకు తీవ్ర గాయాలయ్యారు. మండలంలోని దొమ్మేరు శివార్లలో శనివారం మధ్యాహ్నం ఈ ప్రమాదం చోటుచేసుకుంది. కొవ్వూరులోని బంధువుల ఇంటి వద్ద జరిగే విందుకు అఖిల్,రాజేష్‌లు మోటార్ సైకిల్‌పై బయల్దేరారు. దొమ్మేరు గ్రామ శివార్లలో కొవ్వూరు నుంచి దేవరపల్లి వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు వారి మోటార్ సైకిల్‌ను ఢీకొట్టడంతో ఈ ప్రమాదంలో సంభవించింది. ఇరువురికీ మోకాళ్లకు బలమైన రక్తపు గాయాలు కావడంతో రాజమహేంద్రవరంలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.ఆసుపత్రి నుంచి అందిన సమాచారం మేరకు ఆదివారం కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు పట్టణ ఎస్సై బి.దుర్గాప్రసాద్ తెలిపారు.

చాగల్లులో కొత్తగా విద్యుత్తు స్తంభాల ఏర్పాటు



చాగల్లులో ఏర్పాటు చేసిన విద్యుత్తు స్తంభం

చాగల్లు: విద్యుత్తు శాఖ అధికారులు ఆదివారం చాగల్లు బీసీ ఏరియాలో కొత్త స్తంభాలు ఏర్పాటు చేసి అక్కడి వారి ఇబ్బందులు పరిష్కరించారు. విద్యుత్తు స్తంభాల వల్ల తాము ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు శనివారం ఈ ప్రాంతంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన హోం మంత్రి తానేటి వనితకు ఈ ప్రాంత వాసులు మొరపెట్టుకున్నారు. వెంటనే స్పందించిన మంత్రి వనిత ఇక్కడి సమస్యను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో అధికారులు ఆదివారం నూతనంగా స్తంభాలను ఏర్పాటు చేసి సమస్యల పరిష్కరించారు.ఈ సందర్భంగా మంత్రి తానేటి వనితకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

ఒక విద్యా సంవత్సరం.. రెండు బ్యాచ్‌లు

- డైట్ కళాశాలల్లో వింత పరిస్థితి
- ప్రణాళికా లోపం వల్లే ఇలా..



దూబచర్ల డైట్ కళాశాలలో విద్యార్థులు

నల్లజర్ల: రెండేళ్ల కోర్సు ఉండే కళాశాలల్లో సాధారణంగా ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఉంటారు. సెకండియర్ వారు కోర్సు పూర్తి చేసి వెళ్లిపోగానే ఫస్టియర్ విద్యార్థులు ఉత్తీర్ణులై వారి స్థానంలోకి వెళతారు. కొత్తగా చేరే వారు ఫస్టియర్ విద్యార్థులుగా కొనసాగుతారు. ఈ ఏడాది అన్ని డైట్ కళాశాలల్లోనూ ఈ విద్యా సంవత్సరంలో ఫస్టియర్ పూర్తి చేసిన విద్యార్థులు, సెకండియర్ పూర్తి చేసిన వారు ఇప్పటికీ సెకండియర్‌లోనే కొనసాగుతున్నారు. ప్రణాళికా లోపం వల్ల సకాలంలో అధికారుల కౌన్సెలింగ్ నిర్వహించక పోవడం, సిలబస్ పూర్తికాక పోవడం వల్ల ఈ పరిస్థితి తలెత్తినట్టు చెబుతున్నారు.

వాస్తవానికి 2022–24 బ్యాచ్ విద్యార్థులు సెంకడియర్‌లోకి వెళ్లాలి. అయితే గతేడాది ఆలస్యంగా అక్టోబర్‌లో వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. దాంతో ఫస్టియర్ సిలబస్ పూర్తికానందున పరీక్షలు నిర్వహించలేదు. దాంతో ఇప్పటికీ ప్రథమ సంవత్సరంలోనే కొనసాగుతున్నారు. దీంతో వారిని సీనియర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులుగా పేర్కొటున్నారు. అధ్యాపకులు వారికి కూడా ఫస్టియర్ పాఠ్యాంశాలనే బోధిస్తున్నారు.

అంతకు ముందు బ్యాచ్‌దీ అదే పరిస్థితి..

అలాగే కోర్సు పూర్తి చేసి వెళ్లాల్సిన 2021–23 బ్యాచ్ సెకండియర్ విద్యార్థులు ఇప్పటికీ కళాశాలలోనే ఉన్నారు. వారికి కూడా అడ్మిషన్ కౌన్సెలింగ్ నిర్వహించడంలో జాప్యం జరిగింది. వారికి 2021 జూలైకి బదులుగా డిసెంబర్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ క్రమంలో వారికి కూడా సిలబస్ పూర్తికాలేదు. అందుకే పరీక్షలు నిర్వహించలేదు. దాంతో వారు కూడా ఇప్పటికీ ద్వితీయ సంవత్సరంలోనే కొనసాగుతున్నారు. వారికి అధ్యాపకులు సెకండియర్ పాఠ్యాంశాలనే బోధిస్తున్నారు. నల్లజర్ల మండలంలోని దూబచర్ల డైట్ కళాశాలలోనే కాదు దాదాపు అన్ని డైట్ కళాశాలల్లో ఇదే పరిస్థితి ఉందని చెబుతున్నారు.

సెప్టెంబరు 19 నుంచి సెకండియర్ పరీక్షలు

సెప్టెంబరు 19 నుంచి సెకండియర్ విద్యార్థులకు పరీక్షలు ప్రారంభం అవుతాయి. ఈ రోజే ప్రకటన వచ్చింది. ఆగస్టు 28 నుంచి ప్రాక్టికల్స్ జరుగుతాయి. దీంతో అంతా సర్దుబాటు అవుతుంది. ఫస్టియర్ విద్యార్థులకు రెండో విడత కౌన్సెలింగ్ జరగాల్సి ఉంది.

–పీవీ రమణమూర్తి, ప్రిన్సిపాల్, డైట్, దూబచర్ల